సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 22 । జూన్ । 2025



మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి

మామిడికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. -8లో



టీడీపీ నాయకుడిపై కేసు

సొంత పార్టీ కార్యకర్త, అనుచరుడిపై తంబళ్లపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు సీడ్ మల్లికార్జుననాయుడు, శశిధరనాయుడు చేసిన దాడిపై కేసు నమోదైంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.140	రూ.180
రెండోరకం	రూ.90	రూ.130

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1485 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

వీఆర్‌ఓ కృష్ణప్ప సస్పెన్షన్



లక్కిరెడ్డిపల్లి: లక్కిరెడ్డిపల్లి టౌన్‌కు సంబంధించిన వీఆర్‌ఓ కృష్ణప్పను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి ఉత్తర్వులు జారీ చేశారు. టౌన్ పరిధిలోని సర్వే నంబరు 705/2లోని రెండు ఎకరాల డీకేటీ భూమిని మరొకరికి రిజిస్ట్రేషన్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారని పట్టణానికి చెందిన సాయిలీల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు వీఆర్‌ఓను విధుల నుంచి తొలగించినట్లు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

25న ప్రవేశ పరీక్ష

కడప రూరల్: డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు ఈనెల 25న పరీక్షలు నిర్వహించనున్నట్లు కడప చిన్నచౌక్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎల్.మాధవీలత తెలిపారు. వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతిలో మిగిలి ఉన్న ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తులను ఈనెల 23 వరకు స్వీకరిస్తామని తెలిపారు. 25వ తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షను కడప చిన్న చౌక్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తామని వివరించారు.

నేడు రగ్బీ జట్టు ఎంపిక

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఉమ్మడి కడప జిల్లాలో ఆదివారం జూనియర్ బాల బాలికల రగ్బీ జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు రగ్బీ అసోసియేషన్ సెక్రటరీ వి. ధన నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28–29న 18 ఇయర్స్ కేటగిరి కి సంబంధించిన బాల బాలికల రగ్బీ ఇంటర్ జిల్లాల టోర్నమెంట్ కర్నూలులో జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి కడప జిల్లా జట్టు కోసం ఎంపికలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఎంపికలు కడప మునిసిపల్ స్టేడియంలో జరుగుతాయన్నారు. వివరాలకు 8297059998ను సంప్రదించాలని సూచించారు.

నమో నారసింహ



తరిగొండలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో స్వామివార్లకు విశేష పూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో తరిగొండ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. యోగినీ ఏకాదశి సందర్భాన్ని పురస్కరించుకొని వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అలంకరించారు.భక్తులు పెద్దఎత్తున ఆలయానికి చేరుకున్నారు. నమో నారసింహా...కాపాడు తండ్రీ అని వేడుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

కురవని వాన.. కదలని కాడి!

- జిల్లా రైతాంగాన్ని వెంటాడుతున్న వర్షాభావం
- మళ్లీ కమ్ముకుంటున్న కరువు మేఘాలు
- 24 మండలాల్లో ఎకరా సాగులేదు
- గత జూన్‌లో 141.7 మిల్లీమీటర్ల వర్షం.. ఇప్పుడు కేవలం 17.9 మిమీ
- ఇదే పరిస్థితి కొనసాగితే ఖరీఫ్ సాగు లేనట్టే



బి.కొత్తకోట మండలంలో బీళ్లుగా కనిపిస్తున్న పొలాలు

మదనపల్లి: జిల్లాలో ఖరీఫ్ సాగు తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గత ఖరీఫ్ పరిస్థితులు మళ్లీ పునరావృతమై కరువు కోరల్లో చిక్కుకునేలా కనిపిస్తోంది. ఓవైపు మేఘాలు దోబూచులాడుతుండగా..మరోవైపు రైతులు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేశాక వర్షాలు కురవకపోతే తమ పరిస్థితి ఏమిటన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు గత ఖరీఫ్‌లో పంటలసాగుతో పెట్టుబడి కోల్పోయిన జిల్లా రైతాంగానికి కూటమి ప్రభుత్వం అండగా నిలవలేదు. పైసా పరిహారం చెల్లించలేదు. ఇప్పుడు వర్షాలను నమ్ముకుని పెట్టుబడి పెట్టి నష్టపోతే ప్రభుత్వం ఆదుకుంటుందా అన్న అనుమానం కర్షకుల్లో నెలకొంది. ఈ దయనీయ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారింది. వర్షాభావంతో జిల్లాలో పొలాలన్నీ బీళ్లుగా దర్శనమిస్తున్నాయి.

260 హెక్టార్లకే పరిమితం

జిల్లాలో సాధారణ సాగు లక్ష్యం 62,890 హెక్టార్లుగా నిర్ణయించిన వ్యవసాయశాఖ అందుకు ప్రణాళిక అమలు చేసింది. ఊహించని విధంగా వర్షాలు కురవకపోవడంతో సాగుపై ప్రభావం చూపుతోంది. ఇప్పటికి జిల్లాలో సాగైన విస్తీర్ణం కేవలం 260 హెక్టార్లే. అందులో 10 హెక్టార్లలో వరి, 250 హెక్టార్లలో వేరుశనగ సాగు చేశారు. ఇంకా 26,630 హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉంది. 2024 జూన్‌లో ఈ సమయానికి 933 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. ఇందులో 913 హెక్టార్లలో వేరుశనగ, 20 హెక్టార్లలో వరి సాగైంది. కాగా సాగుకు కీలకమైన జూన్ నెలలో వర్షాలు లేకపోతే ఆ ప్రభావం మొత్తం ఖరీఫ్‌పైనే ఉంటుంది. దీంతో ఖరీఫ్ సాగుతుందా అన్నది అనుమానమే.

ప్రభుత్వానికి ముందే తెలుసా

జిల్లాలో ఖరీఫ్ సాగుపై ప్రభుత్వం ముందే అంచనా వేసిందా అన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఎందుకంటే ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లాలో 62,890 హెక్టార్లతో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేయగా అందులో వేరుశనగకు సంబంధించి రైతులకు 55,066 క్వింటాళ్ల విత్తనకాయలు కేటాయించాలని ప్రభుత్వానికి నివేదించారు. అయితే గత ఏడాది పంటల సాగును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం 36,034 క్వింటాళ్లు మాత్రమే కేటాయిస్తూ 19,032 క్వింటాళ్లకు కోత వేసింది. ప్రస్తుతం వేరుశనగ విత్తన కాయలకు రైతుల నుంచి ఆశించిన మేర డిమాండ్ కనిపించడం లేదు. సరఫరా అయిన విత్తనకాయల వరకే పంపిణీ సరిపోయేలా ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు.

తీవ్ర వర్షాభావం



జిల్లాలో జూన్‌లో సాధారణ వర్షపాతం 75.1 మిల్లీమీటర్లు నమోదవ్వాలి. అయితే శనివారం (21) నాటికి కురిసిన వర్షం కేవలం 17.9 మిల్లీమీటర్లే. సాధారణ వర్షపాతానికి ఇంకా 57.2 మిల్లీమీటర్ల వాన కురవాల్సి ఉంది. ఇక మిగిలిన 8 రోజుల్లో ఈ స్థాయిలో వర్షం కురిసే అవకాశాలు కనిపించడం లేదు. 2024 ఖరీఫ్‌లో జూన్‌లో సాధారణ వర్షపాతానికి మించి అత్యధికంగా 141.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

- జిల్లాలో ఇప్పటి వరకు చిన్నమండెం, సంబేపల్లె, టి.సుండుపల్లె, రాయచోటి, గాలివీడు, నందలూరు మండలాల్లోనే పంటల సాగు మొదలైంది. మిగిలిన లక్కిరెడ్డిపల్లె, రామాపురం, పెనగలూరు, రాజంపేట, చిట్వేలి, పుల్లంపేట, ఓబులవారిపల్లె, కోడూరు, తంబళ్లపల్లె, ములకలచెరువు, కురబలకోట, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, కంభంవారిపల్లె, పీలేరు, పెద్దమండ్యం, గుర్రంకొండ, కలకడ, కలికిరి, వాయల్పాడు మండలాల్లో క్క ఎకరా కూడా సాగుకు నోచుకోలేదు.

వాన కోసం ఎదురుచూస్తున్నాం



రెండెకరాల్లో వేరుశనగ సాగుకు విత్తనం, ఎరువులు సిద్ధంగా పెట్టుకున్నాం. వర్షాభావ పరిస్థితి నెలకొన్న కారణంగా పంటల సాగుపై ఆలోచిస్తున్నాం. వర్షం కురిసుంటే ఈపాటికి పంటలు సాగు చేసేవాళ్లం. ఈ ఖరీఫ్‌లో ప్రభుత్వ రాయితీ విత్తనకాయలను తీసుకోలేదు. పంటలను సాగు చేసేందుకు ఎదురుచూస్తున్నాం. -జి.గంగాధర, శ్రీరాంపురం, నిమ్మనపల్లె

దుక్కులు దున్నాం



మూడు ఎకరాల్లో వేరుశనగ సాగుకు దుక్కులు దున్ని భూమి సిద్ధం చేశాం. వర్షం ఎప్పుడు కురుస్తుందా అని ఎదురుచూస్తున్నాం. గతేడాది ఈ సమయానికి వర్షం కురిసి పంటలు సాగు చేశాం. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. ఈ ఖరీఫ్ ఏం చేస్తుందో అని దిగాలుగా ఉంది. -కే.రెడ్డెప్పరెడ్డి, మర్రిమాకులపల్లె, తంబళ్లపల్లె

భావితరాలకు నవోదయం

దరఖాస్తుల ఆహ్వానం



మదనపల్లె సిటీ: కార్పొరేట్ పాఠశాలల ధీటుగా అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య,ఉత్తమ విలువలు,దేశభక్తి , క్రీడలు ఇలా అన్ని రంగాల్లో విద్యార్థులను నిపుణులుగా తీ ర్చిదిద్దుతూ ఆదర్శంగా నిలుస్తోంది ఉమ్మడి చిత్తూరు జి ల్లాలోని మదనపల్లె సమీపం వలసపల్లి, ఉమ్మడి కడప జి ల్లాలోని రాజంపేటలోని జవహర్ నవోదయ విద్యాలయా లు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరంగా మారిన నవోద య విద్యాలయాల్లో 2026–27 విద్యా సంవత్సరంలో ప్రవే శానికి దేశవ్యాప్తంగా నోటిఫికేషన్ విడుదలైంది. ఆరో తరగతిలో ప్రవేశాలకుగాను దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.

'నెట్‌లో దరఖాస్తుల ఆహ్వానం

విద్యాలయంలో ప్రవేశానికి డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో ఇంటర్‌నెట్‌లో దరఖాస్తులు సమర్పించాలి. పాఠశాలలో ఆరో తరగతిలో 80 సీట్లు ఉంటాయి. దరఖాస్తు సమర్పణకు జులై 29 చివరి తేదీగా ప్రకటించారు. ఈ ఏడాది డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు.

రిజర్వేషన్లు: విద్యాలయంలోని 80 సీట్లలో 75 శాతం (60 సీట్లు) గ్రామీణ ప్రాంత, 25 శాతం (20 సీట్లు) పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తారు. అందులో 15 శాతం ఎస్సీ, 7.5 శాతం ఎస్టీ, 3 శాతం దివ్యాంగులు, బాలికలకు 1/.3 వంతు రిజర్వేషన్ అమలు చేస్తారు. అభ్యర్థి ఫోటో, సంతకం, తల్లి/ తండ్రి/ సంరక్షకుడి సంతకంతో దరఖాస్తులు సమర్పించాలి.



మదనపల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయం

'సీబీఎస్ఈ సిలబస్... నాణ్యమైన విద్య

ఆరో తరగతి ప్రవేశం పొందితే ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా బోధిస్తారు. విద్యార్థుల్లో జాతీయ సమైక్యత భావాన్ని పెంపొందించేలా వలస (మైగ్రేషన్) విధానాన్ని ప్రవేశపెట్టింది. ఏటా తొమ్మిదో తరగతి చిన్నారులను ఇతర రాష్ట్రాలకు పంపిస్తారు. ఇతర రాష్ట్రాల నుంచి వారిని ఇక్కడికి తీసుకువస్తారు. ఆరో తరగతి నుంచి కంప్యూటర్ విద్య బోధిస్తారు. ఆధునాతన వసతులతో కూడిన గ్రంథాలయం, ఎస్‌సీసీ, క్రీడలకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు. ప్రతి ఏటా శతశాతం ఉత్తీర్ణ సాధిస్తూ ప్రతిభ చాటుతున్నారు.



ఎన్‌సీసీలో శిక్షణ పొందుతున్న నవోదయ విద్యార్థులు

అర్హతలు ఇలా...

3,4,5 తరగతులు ప్రభుత్వం లేదా గుర్తింపు పొందిన పాఠశాలలో చదవాలి. అయిదో తరగతి తప్పనిసరిగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చదివి ఉండాలి. ఆధార్‌కార్డు తప్పనిసరి. లేదా తహసీల్దార్ కార్యాలయం నుంచి నివాస ధ్రువీకరణ పత్రం అవసరం. అభ్యర్థి తల్లిదండ్రులు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందినవారై ఉండాలి. అభ్యర్థులు 1.5.2014 నుంచి 31.07.2016 మధ్య జన్మించిన వారు అర్హులు.

పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ:



విద్యాలయంలో ప్రవేశాల పరీక్ష,ఎంపిక పూర్తిగా పారదర్శకంగా ఉంటుంది. విద్యార్థుల మార్కుల ఆధారంగానే ప్రవేశాలు ఉంటాయి. దళారులను నమ్మవద్దు. దరఖాస్తు, ప్రవేశ పరీక్ష, ఎంపిక ప్రక్రియ పూర్తిగా ఇంటర్‌నెట్‌లోనే ఉంటుంది. ప్రవేశపరీక్షపై భయం వీడి విద్యార్థులు కష్టపడి చదివితే సులువుగా ప్రవేశం పొందవచ్చు. -గీత, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ విద్యాలయ, మదనపల్లె

అన్నదానానికి విరాళం



నిత్యాన్నదానానికి విరాళం అందజేస్తున్న దాత రామాంజనేయుల రెడ్డి

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం రు.1,00,116లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయకమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు.దువ్వూరు మండలం భీమునిపాడుకు చెందిన కుప్పన గారి సంజీవరెడ్డి కుమారుడు రామాంజనేయులరెడ్డి విరాళం ఇచ్చాడని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన ఉప ప్రధాన అర్చకులు కేసరి,రాజారమేష్,మాజీ చైర్మెన్ వెంకటస్వామి పాల్గొన్నారు.

యోగాను అభ్యసించి మానసికంగా దృఢంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్





యోగాలో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్, ప్రజలు, పోలీస్ పేరెడ్ గ్రౌండ్‌లో యోగా చేస్తున్న పోలీసులు

రాయచోటి: యోగాను ప్రతిరోజు అభ్యసించి శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అభిప్రాయపడ్డారు. జిల్లాను యోగాంధ్ర కార్యక్రమంలోని వివిధ అంశాల్లో మొదటి స్థానంలో నిలిపిన జిల్లా ప్రజలకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం రాయచోటిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో కలెక్టర్ నాయకత్వంలో 5 వేల మందితో యోగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. రాయచోటిలో 5 వేల మందితో, 5050 ప్రాంతాల్లో 8 లక్షల మందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ మాట్లాడుతూ జిల్లాలో మే 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన జిల్లా అధికారులకు, ఎంపీడీఓలకు ముఖ్యంగా రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, పీడీ డీఆర్‌డీఏ సత్యనారాయణ, రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసు, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణంలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసు, రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అందరూ యోగా సాధన చేయాలి

పరిపూర్ణ జీవనశైలికి యోగా ఒక బాటగా నిలుస్తుందని జిల్లా అదనపు ఎస్పీ ఎం వెంకటాద్రి అన్నారు. జిల్లా ఎస్పీ వి విద్యాసాగర నాయుడు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో రాయచోటి పోలీసులు పరేడ్ మైదానంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా గురువులు పోలీసు సిబ్బందికి యోగాలో ఉన్న మెలకువలు నేర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిపూర్ణ ఆరోగ్యాన్ని సంపాదించుకోవడానికి నిరంతర యోగా సాధన చేయాలన్నారు.కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్, ఎం పెద్దయ్య, యోగా గురువులు నారాయణ, సహదేవరెడ్డి, శ్రీనివాసులు, రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

సంబేపల్లె : పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ చిన్నబిడికి సమీపంలో పేకాట ఆడుతున్నారని ముందస్తు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి రూ.27,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సిద్ధవటం రేంజిలో కూంబింగ్

సిద్ధవటం : సిద్ధవటం రేంజి పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించినట్లు రేంజర్ బి. కళావతి తెలిపారు. సిద్ధవటం అటవీ శాఖ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్ఓ వినీత్‌కుమార్ ఆదేశాల మేరకు ఫారెస్టు రేంజి పరిధిలోని గొల్లపల్లె బీటు, సిద్ధవటం బీటు, రోళ్లబోడు బీట్లలోని సమస్యాత్మక, అనుమానిత అటవీ ప్రాంతాల్లో శుక్రవారం నుంచి కూబింగ్ నిర్వహించామన్నారు. అటవీ ప్రాంతాల సమీప గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచా రం ఇవ్వాలన్నారు. ఈ కూంబింగ్‌లో డీఆర్ఓ ఓబులేసు, బీటు అధికారులు, అసిస్టెంటు బీటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యువత పోరును విజయవంతం చేయండి


యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్. రమేష్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయచోటి టౌన్ : యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రాయచోటి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు నాయుడు అనేక రకాల హామీలు ఇచ్చారన్నారు. వాటిలో ప్రధానంగా ఆరు పథకాలకు సూపర్ సిక్స్ అని పేరు పెట్టి అమలు చేస్తానని నమ్మించారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని మరిచారని విమర్శించారు. అమ్మకు వందనం పేరుతో తల్లులకు కూడా మోసం చేస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో 80 లక్షలకు పైగా అర్హత కలిగిన వారు ఉంటే ప్రభుత్వం మాత్రం 50 లక్షల మందికి మాత్రమే ఇస్తోందన్నారు. ఇక యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ మాటే ఎత్తడం లేదన్నారు. ఉద్యోగం ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి రూ.3000 ఇస్తానని చెప్పారని కానీ ఏడాది పూర్తి అవుతున్నా ఆ విషయం పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు చేసిన మోసాలను ఎండగట్టేందుకు ఈ నెల 23వ తేదీ రాయచోటిలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట యువత పోరు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్, మైనార్టీ నాయకుడు కొలిమి హరూన్ బాషా, యువజన విభాగం అధ్యక్షుడు శివప్రసాద్ రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు కిశోర్ దాస్ రెడ్డి, పరుశురాం నాయుడు, రెడ్డికుమార్, అజ్మత్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి


మామిడి రైతుల సమస్యసలు వింటున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : మామిడికి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌కు శనివారం మామిడిని సాగు చేసే రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మామిడికి గిట్టుబాటు ధర లేకపోవడంతో ఎంతో నష్టపోయామని వాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉండాల్సింది పోయి వారిని నట్టేట ముంచుతోందని మండిపడ్డారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకున్న ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందన్నారు. అలాగే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కూడా రైతులకు అండగా ఉంటూ వారని అక్కున చేర్చుకున్నారని కొనియాడారు. నేడు కూటమి ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా మోసం చేసి దోచుకుంటోందని ధ్వజమెత్తారు. రైతులను విస్మరిస్తే కూటమి ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు.

జిల్లా జట్టుకు ఎంపిక


వైష్ణవి


రిషిత

నందలూరు : అండర్–19 బాలికల విభాగంలో సీఏవైడీ కడప జిల్లా క్రికెట్ జట్టుకు రాజంపేటకు చెందిన కేంద్రీయ విద్యాలయం విద్యార్థిని మోహనవైష్ణవి బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా, రిషిత మీడియం ఫాస్ట్ బౌలింగ్ విభాగంలో ఎంపికైనట్లు సబ్ సెంటర్ కోచ్‌లు గయాజ్, ఫిరోజ్ ఖాన్ లోడీలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన ఇద్దరు అమ్మాయిలు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యేలా శిక్షణ ఇచ్చిన ట్రైనర్ శివకోటి, పీఈటీ రాహుల్, కోచ్‌లు, సీఏవైడీ ప్రెసిడెంట్ భరత్‌రెడ్డి, సెక్రటరీ రెడ్డిప్రసాద్, డీసీఏ ఖాజామైనుద్దీన్, ఉమెన్ క్రికెట్ కోఆర్డినేటర్ విష్ణుమోహన్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

టిప్పర్ ఢీకొని తీవ్ర గాయాలు

ముద్దనూరు : స్థానిక కొత్త బస్టాండు సమీపంలో శనివారం టిప్పర్ ఢీకొని ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. పవన్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తి కడప రహదారిలో వెళ్తుండగా కొత్త బస్టాండు వైపు నుంచి వస్తున్న ఓ టిప్పర్ ఢీకొంది. ఈ ఘటనలో పవన్‌కు కాలు విరగడంతో పాటు గాయాలయ్యాయి.

దాడికి పాల్పడిన టీడీపీ నాయకుడిపై కేసు


టీడీపీ కార్యకర్తపై దాడి చేస్తున్న టీడీపీ నేతలు మల్లికార్జున నాయుడు, శశిధరనాయుడు

మదనపల్లె రూరల్ : సొంత పార్టీ కార్యకర్త, అనుచరుడిపై తంబళ్లపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు సీడ్ మల్లికార్జున నాయుడు, కుమారుడు శశిధర నాయుడుతో కలిసి దాడి చేసిన ఘటనపై శుక్రవారం రాత్రి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కురవంక హోసన్నా చర్చి సమీపంలో నివసిస్తున్న చంద్రమోహన్ కుమారుడు సి.అనిల్‌కుమార్ చాలా కాలంగా టీడీపీ నాయకుడు సీడ్ మల్లికార్జున ప్రధాన అనుచరుడిగా ఉండేవాడు. ఆరునెలల క్రితం అనిల్‌కుమార్, సీడ్ మల్లికార్జున నాయుడు వెంట తిరగడం వదిలేసి, మరో నాయకుడైన కట్టా దొరస్వామినాయుడు వద్దకు చేరాడు. కొద్దిరోజుల క్రితం కట్టా దొరస్వామినాయుడు జన్మదినం సందర్భంగా బ్యానర్లు ఏర్పాటు చేశాడు. తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డికి వ్యతిరేకంగా వాట్సప్‌లో పోస్ట్ పెట్టాడు. విషయం తెలుసుకున్న సీడ్ మల్లికార్జున నాయుడు, ఈనెల 10వతేదీ ఉదయం 6.30 గంటలకు కుమారుడు శశిధరనాయుడు, డ్రైవర్ రాజేష్‌తో కలిసి అనిల్‌కుమార్ ఇంటికి వెళ్లాడు. అనిల్ భార్య గీత చూస్తుండగా, సోషల్ మీడియాలో తమకు వ్యతిరేకంగా పోస్టులు పెడతావా అని పిడిగుద్దులు గుద్దుతూ, చేతులతో కొడుతూ, కాలితో తన్నుతూ బీభత్సం సృష్టించారు. ఈ తతంగాన్ని డ్రైవర్ రాజేష్ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. తాను పోస్ట్ పెట్టలేదని ప్రాధేయపడుతున్నా వినిపించుకోకపోగా, కాళ్లతో తన్నుతూ తాము దాడి చేసిన విషయం ఎవరికైనా చెబితే అంతుచూస్తామని బెదిరించారు. తర్వాత ఈనెల 20వ తేదీన సోషల్ మీడియాలో సీడ్ మల్లికార్జుననాయుడు వీడియోను పోస్ట్ చేశారు. వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, అనిల్ తనకు జరిగిన అవమానంపై, శుక్రవారం రాత్రి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీడ్ మల్లికార్జున నాయుడు, శశిధర నాయుడుపై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎరీషావలి తెలిపారు.

నకిలీ బంగారుతో బ్యాంకులకు బురిడీ

రాయచోటి : నకిలీ బంగారు ఆభరణాలను చూపి బ్యాంకులను బురిడీ కొట్టించి లక్షల రూపాయల రుణాలను పొందిన సంఘటన రాయచోటిలో వెలుగు చూసింది. మూడు పర్యాయాలు నకిలీ బంగారు పెట్టి రూ.11 లక్షల రుణాలు పొందిన వ్యక్తి నాలుగో పర్యాయం మిత్రునితో కలిసి శుక్రవారం బ్యాంకులో రుణం పొందే ప్రయత్నం బెడిసి కొట్టింది. రాయచోటి పోలీసుల వివరాల మేరకు.. రాయచోటికి చెందిన షేక్ హైదర్ అలీ మూడు సంవత్సరాల క్రితం రాయచోటిలోని కరూర్ వైశ్యా బ్యాంకులో బ్యాంకు సిబ్బందిని మోసగించి 74.4 గ్రాముల నకిలీ బంగారాన్ని అప్పగించి రూ 2.5 లక్షల రుణాన్ని పొందాడు. అలాగే పట్టణంలోని నేతాజీ సర్కిల్, సుండుపల్లి రోడ్డు మార్గాలలో ఉన్న ఎస్‌బీఐ బ్రాంచ్‌లలో నకిలీ బంగారు ఆభరణాలను పెట్టి రెండేళ్ల క్రితం ఎనిమిది లక్షల రూపాయల రుణాలను పొందాడు. కరూర్ వైశ్యా బ్యాంకులో మూడేళ్ల క్రితం పెట్టిన బంగారు రుణం రెన్యువల్ చేయించుకోవాలని ఇటీవల నోటీసులు ఇచ్చారు. ఇదే సమయంలో హైదర్ అలీ ఈనెల 20వ తేదీ శుక్రవారం తన మిత్రుడు రియాజ్ ద్వారా నకిలీ బంగారంతో కరూర్ వైశ్యా బ్యాంకులో రుణం పొందే ప్రయత్నం చేశాడు. రుణం కోసం తెచ్చిన బంగారు ఆభరణాలు నకిలీవని తేలడంతో సెక్యూరిటీ సిబ్బంది ద్వారా బ్యాంకు అధికారులు విచారణ చేపట్టారు. ఈ విచారణలో గతంలో హైదర్ అలీ పెట్టిన బంగారు నగలు నకిలీవని సమాచారం ఇవ్వడంతో మూడు బ్యాంకుల్లో దాచిన బంగారు నగలను పరిశీలించారు. బ్యాంక్ అధికారులు హైదర్ అలీ, రియాజ్‌లపై రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం ఇరువురిపై 420, 406 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ బీవీ చలపతి తెలిపారు.

పుత్తూరు సిద్ధార్థలో గ్రాడ్యుయేషన్ డే



యువ ఇంజినీర్‌కు స్వర్ణ పతకం అందజేస్తున్న వీసీ సుదర్శనరావు, అశోకరాజు

నారాయణవనం : పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శనరావు, వోల్వా గ్రూప్ రిటైర్డ్ డైరెక్టర్ ఇందు శేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొని పాస్ అవుట్ ఇంజినీరింగ్ విద్యార్థులకు పతకాలు, పట్టాలు అందజేశారు. అనంతరం ఆడిటోరియంలో జరిగిన కాన్వొకేషన్ డే సమావేశంలో కళాశాలల చైర్మన్ డాక్టర్ అశోకరాజు మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్యను అందించేందుకు సిద్ధార్థ గ్రూప్ కళాశాలలు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ స్థాయి ల్యాబ్, డిజిటల్ లైబ్రరీ, ఇంకుబేషన్ సెంటర్లను అభివృద్ధి చేశామన్నారు. విద్యా ప్రమాణాలు, నాణ్యతలో రాజీ పడకుండా విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. వైస్ చాన్సలర్ సుదర్శనరావు మాట్లాడుతూ తోటి వారితో పోటీ పడి సృజనాత్మక, ఇన్నోవేటివ్ విద్యపై శ్రద్ధ చూపాలన్నారు. యువ ఇంజినీర్లు నిరంతరం పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలో ఉత్తీర్ణత పొందిన 903 మంది, సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఉత్తీర్ణత పొందిన 485 మందికి డిగ్రీ కాన్వొకేషన్లు అందజేశారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 17 మంది విద్యార్థులకు స్వర్ణ పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ నామినీస్ ప్రశాంతి, అరుణక్రాంతి, ప్రిన్సిపాల్ మధు, జనార్దనరాజు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ విజయభాస్కర్, గోపి, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది


రైతులు, వ్యాపారులతో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

రైల్వేకోడూరు అర్బన్ : అన్నమయ్య జిల్లాలో మామిడి రైతులకు కలిగిన ఇబ్బందులు ప్రభుత్వం గుర్తించి వారి సమస్యలు పరిష్కరించడానికి అన్ని చర్యలు తీసుకుంటోందని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. ఆయన శనివారం ఆకస్మికంగా రైల్వేకోడూరులో పర్యటించి మామిడి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. మార్కెట్ యార్డులో రైతులు, వ్యాపారులతో మాట్లాడి అనంతరం శెట్టిగుంటలోని జ్యూస్ ఫ్యాక్టరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు, రాజంపేట పరిధిలో 2630 హెక్టార్లలో తోతాపూరి మామిడి రకాన్ని రైతులు సాగు చేస్తున్నారని, వీటిలో 22 వేల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందన్నారు. కచ్చితంగా ప్రతి రైతుకు ప్రభుత్వం ప్రకటించిన కేజీకి రూ. 4లు సబ్సిడీ అందిస్తామని పేర్కొన్నారు. అలాగే ఫ్యాక్టరీల సామర్థ్యాన్ని బట్టి రైతులు మామిడి కాయలు కోసి అందించాలన్నారు. ఏ ఒక్క రైతుకు నష్టం వాటిల్లకుండా చూసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారిణి సుభాషిణి, తహసీల్దార్ అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీ కొన్న కంటైనర్


రోడ్డుపై అడ్డంగా బోల్తాపడిన కంటైనర్

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మంటపంపల్లి గ్రామ సమీపంలో కడప–చెన్నై జాతీయ రహదారిపై ట్రాక్టర్‌ను కంటైనర్ ఢీకొంది. పోలీసుల వివరాల మేరకు శనివారం తెల్లవారుజామున మూడు గంటలకు చెన్నై నుంచి కడప వైపు వెళ్తున్న కంటైనర్ మంటపంపల్లి సమీపంలోకి రాగానే రాజంపేట వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొట్టి బోల్తాపడింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమి కాలేదు. అయితే కంటైనర్ రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించి పోయి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

రెండు బైక్‌లు ఢీ కొని యువకుడి మృతి


మృతి చెందిన గంగాధర్

మైదుకూరు : రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మైదుకూరు మండలం చెర్లోపల్లె సమీపంలో శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. చింతకొమ్మదిన్నె మండలం లక్కిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన దొడ్డి పద్మావతి తన కుమారుడు గంగాధర్ (20)తో కలసి చెర్లోపల్లెలో ఉన్న ఆమె చెల్లెలు గుర్రమ్మ ఇంటికి వచ్చింది. అక్కడి నుంచి చాపాడు మండలం నాగులపల్లె గ్రామంలో గుర్రమ్మ కుమార్తె సీమంతానికి హాజరయ్యేందుకు మోటార్ బైక్‌పై తల్లి కొడుకు బయల్దేరారు. చెర్లోపల్లె సమీపంలో వీరి బైక్ ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న గంగాధర్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుని తల్లి పద్మావతికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స కోసం 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై మైదుకూరు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


రోడ్డు ప్రమాదంలో ఛిద్రమైన మృతదేహం

వల్లూరు : కడప – తాడిపత్రి ప్రధాన రహదారిలో విమానాశ్రయం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వల్లూరు మండల పరిధిలోని పుల్లారెడ్డి పేట గ్రామానికి చెందిన బి.భాస్కర్ రెడ్డి (38) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు పుల్లారెడ్డిపేటకు చెందిన భాస్కర్ రెడ్డి భార్య చెవి సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకుని కడపలోని ఓ ఆసుపత్రిలో ఉన్నారు. భార్య వద్దకు వెళ్లేందుకు భాస్కర్‌రెడ్డి తన కుమారుడు ప్రణీత్ రెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంలో కడపకు బయలు దేరాడు. విమానాశ్రయం సమీపంలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు నుంచి వస్తున్న సిమెంట్ ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో కిందపడ్డ భాస్కర్‌రెడ్డిపై ట్యాంకర్ ఎక్కడంతో అతని శరీరం ఛిద్రంగా మారి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని కుమారుడు ప్రణీత్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బాలుడిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు తిరుపతికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శాటిలైట్ రంగంపై అవగాహన అవసరం

చాపాడు : విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు శాటిలైట్ రంగంపై అవగాహన కలిగి ఉండాలని, ఇందుకోసం ఆయా పాఠశాలలు చర్యలు తీసుకోవాలని ఇస్రో ప్రాజెక్టు మాజీ డైరెక్టర్, సీనియర్ సైంటిస్ట్ టీకే సుందరమూర్తి పేర్కొన్నారు. స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్పేస్ ల్యాబ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం ఆయన ముందు చూపునకు నిదర్శనమన్నారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పుస్తకాల ద్వారా మాత్రమే జ్ఞానం పొందలేరని ప్రయోగశాల ద్వారా నేర్చుకున్న విద్య ఎప్పటికీ గుర్తుండి పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వి.లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బి.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తంబళ్లపల్లె : మానసిక పరిస్థితి సరిగా లేక ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగు చూసింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని మర్రిమాకుపల్లెకు చెందిన బాలకృష్ణమనాయుని కుమారుడు భూపతి నాయుడుకు (30) మతిస్థిమితం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం గ్రామ సమీపంలోని బోరు వద్దకు వెళ్లి కానుగచెట్టుకు ఉరి వేసుకున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం తండ్రి బోరువద్దకు వెళ్లగా అప్పటికే మృతదేహం గుర్తు పట్టలేని విధంగా తయారై దుర్వాసన వస్తోంది. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఏఎస్ఐ నరసింహులు సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అప్పటికే చీకటి పడడంతో శనివారం వీఆర్ఓ వేణురెడ్డి సమక్షంతో శవపంచనామా నిర్వహించి అక్కడే పోస్టుమార్టం చేశారు. మృతునికి భార్య శ్యామల, తొమ్మిది నెలల బాబు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో వీరంగం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక కూరగాయల మార్కెట్ సమీపంలో శనివారం దువ్వూరు మండలం కృష్ణంపల్లె గ్రామానికి చెందిన శ్రీనివాసులు మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు. అక్కడున్న మహిళను దూషించడంతో రాజుపాళెం మండలం వెలవలి గ్రామానికి చెందిన ఓబుళమ్మ అనే మహిళ అతన్ని పట్టుకొని దేహశుద్ధి చేసింది. స్థానికులు వారించడంతో అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

వేధింపులపై కేసు నమోదు

ముద్దనూరు : భర్త, అత్తమామలు తనను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నారని వాసంతి అనే వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ దస్తగిరి సమాచారం మేరకు మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన వాసంతికి ఐదేళ్ల క్రితం మైలవరం మండలం దొమ్మరనంద్యాలకు చెందిన శరత్‌తో వివాహమైంది. గత కొంతకాలం నుంచి శరత్, అతని తలిదండ్రులు వేధిస్తుండటతో పోలీసులను ఆశ్రయించింది.

పులివెందులలో దుండగుల హల్ చల్


పెద్దకొండప్ప కాలనీలో అర్ధరాత్రి సంచరిస్తున్న యువకుడు

పులివెందుల రూరల్ : పట్టణంలోని పెద్దకొండప్ప కాలనీ–2లో శుక్రవారం రాత్రి కొందరు దుండగులు హల్ చల్ చేశారు. అర్ధరాత్రి వీధిలోకి ప్రవేశించిన దుండగులు ఇళ్ల ముందు పార్కు చేసి ఉన్న దాదాపు 10 ద్విచక్ర వాహనాలను కింద పడవేసి.. కొన్నింటిని పగులగొట్టి వెళ్లారు. ఉదయాన్నే కాలనీ వాసులు రాత్రి జరిగిన సంఘటనను చూసి భయభ్రాంతులయ్యారు. వీరు కాలనీలో వీధి వెంట దర్జాగా నడుచుకుంటూ వెళుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఇటీవల ఏదో ఒక ప్రాంతంలో చిన్న చిన్న చోరీలు జరుగుతుండటంతో పట్టణ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పులివెందుల పట్టణంలో చాలామంది యువత గంజాయి, మద్యానికి అలవాటుపడి డబ్బుల కోసం నేరాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ చర్యకు పాల్పడింది ఆకతాయిలా.. లేక దొంగలా అనేది తేలాల్సి ఉంది. పోలీసులు స్పందించి చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో యువతకు అన్యాయం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి
- ఈనెల 23న యువత పోరు ర్యాలీ
- అనుమతి కోసం జిల్లా ఎస్పీకి వినతిపత్రం


జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

కడప అర్బన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13 నెలల్లోనే ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం యువతతో పాటు, విద్యార్థులకు సకాలంలో పథకాలను వర్తింపచేయకుండా దగా చేస్తోందని, ఈ విధానానికి వ్యతిరేకంగా ఈనెల 23న కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం నుంచి 'యువతపోరు' పేరుతో ర్యాలీగా కలెక్టరేట్‌కు బయలుదేరి కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించేందుకు పోలీసుల అనుమతి కోసం శనివారం కడపలోని జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో యువజన, విద్యార్థి విభాగాల నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం రవీంద్రనాథ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 13 నెలల్లోనే యువతతోపాటు, రైతులకు, మహిళలకు అన్ని వర్గాలకు మోసం చేసిందన్నారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని, లేదంటే ప్రతినెలా రూ. 3000 నిరుద్యోగ భృతిని అందజేస్తామని చెప్పి అమలు చేయలేదన్నారు. వీటిపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకే 'యువతపోరు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన 'అమ్మ ఒడి' పథకానికి 'తల్లికి వందనం' అనే పేరు మార్చి ఏడాది తరువాత ఇటీవల ఎంత మంది తల్లుల బ్యాంకు ఖాతాలలో రూ. 15000 చొప్పున వేశారో అంచనాకు రాలేదన్నారు. ఎవరెవరికి, ఏయే షరతులను విధించి ఆ పథకానికి దూరం చేశారో తేలాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎంతమంది విద్యార్థులకు వర్తింపచేశారో కూడా తెలియాల్సి ఉందన్నారు. గత ఏడాది కాలం నుంచి ఫీజు రీ యింబర్స్‌మెంట్‌లో భాగంగా విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు వర్తింపచేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. అధికారంలోకి రాకముందు తల్లికి వందనం ఎలాంటి షరతులు లేకుండా అందరికి వర్తింపజేస్తామని, ఎంతమంది పిల్లలుంటే వారందరికి పథకం వర్తింపజేస్తామని 'బాబు ష్యూరిటీ' పేరుతో హామీలను ఇచ్చారని, సూపర్ సిక్స్‌లో ఏ పథకం సక్రమంగా అమలు చేయకపోయినా 'చొక్కా పట్టుకుని నిలదీయండి' అని చెప్పారన్నారు. తల్లికి వందనం, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన, విద్యాకానుక లాంటి పథకాలను చంద్రబాబు అమలు చేయకపోవడంతో 13 నెలల్లోనే దాదాపు రూ.22వేల కోట్లు లబ్ధిదారులకు బకాయిలు పడ్డారన్నారు. ఈ పథకాలను అమలు చేసేంత వరకు తాము పోరాడుతూనే ఉంటామన్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షఫీవుల్లా, నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర, విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు శివారెడ్డి పాల్గొన్నారు.